

సండే సందడి

ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. ప్రాజెక్టు నీటిలో సెల్ఫీలు దిగుతూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. కొంతమంది బోటింగ్ చేస్తూ, ప్రాజెక్టు పరిసరాల్లో ఎంజాయ్ చేశారు.

ధారూరు, జూలై 7



పోచారం మున్సిపాలిటీ సంస్కృతి టౌన్‌షిప్‌లో జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

ఘనంగా జగన్నాథుడి రథయాత్ర

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో అంగరంగ వైభవంగా జగన్నాథుడి రథయాత్ర కొనసాగింది. ఆలయం నుంచి టౌన్‌షిప్ ప్రధాన రహదారి వరకూ రథయాత్ర సాగింది. భక్తులు తరలివచ్చి రథాన్ని లాగారు. కాగా ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు మాధవీలత ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని అన్నారు. కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తి యోగ క్లబ్, సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్, మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఘట్‌కేసర్, జూలై 7



ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు ఒడ్డున నీటిలో సందర్శకుల సందడి

రక్తమైసమ్మకు బోనాలు

తాండూరు రూరల్, జూలై 7 : ఆషాఢమాస బోనాల ఉత్సవాలు ప్రారంభమైనాయి. ఆదివారం తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామంలో రక్తమైసమ్మ అమ్మ వారికి బోనాలు సమర్పించారు. ఉదయం గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యే పూజలు చేశారు. అనంతరం పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చల్లంగా చూడాలని మొక్కుకున్నారు.



బోనాలతో వెళ్తున్న మహిళలు

ఆధ్యాత్మికతకు పుట్టినిల్లు మనదేశం

- అన్ని సంస్కృతులను గౌరవించే గొప్ప సంస్కృతి మనది
- ఇస్కాన్ ఆధ్యాత్మిక సేవలు అభినందనీయం
- గవర్నర్ రాధాకృష్ణన్



మాట్లాడుతున్న గవర్నర్ రాధాకృష్ణన్

మేడ్చల్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతకు మన దేశం పుట్టినిల్లుగా మారిందని, ఫలితంగా ప్రతీ ఒక్కరు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారని గవర్నర్ రాధాకృష్ణన్ అన్నారు. మేడ్చల్ మండలం డబీల్‌పూర్‌లో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వామిజగన్నాథ రథయాత్ర ముగింపు కార్యక్రమానికి గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పుణ్యక్షేత్రాలకు పుట్టినిల్లు మన దేశమన్నారు. ప్రపంచంలోని అన్నిమతాల సంస్కృతులను, ఆచారాలకు సముచిత స్థానం కల్పించి వాటిని గౌరవిస్తున్నామన్నారు. ప్రపంచంలోని అన్ని సంస్కృతులను గౌరవించే గొప్ప సంస్కృతి మనదని తెలిపారు. మన పూర్వీకులు మనకు వారసత్వంలో ఇచ్చిన గొప్ప ఆస్తి మన సంస్కృతి అన్నారు. నేటి తరానికి వన సంస్కృతి గురించి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన చరిత్రను, సంస్కృతులకు చిహ్నంగా ఉండే ఆలయాలను మనం కాపాడుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, యాదాద్రి ఆలయాల గొప్పతనం ఇక్కడి సంస్కృతులకు చిహ్నాలని తెలిపారు. ఇస్కాన్ సంస్థ వారు ఆధ్యాత్మికతను పెంపొందించే దిశగా ప్రపంచ వ్యాప్తంగా తమ సేవలను విస్తరించడం అభినందనీయమన్నారు. మన సంస్కృతి గొప్పతనాన్ని చాటే ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రపంచంలోని పలు భాషల్లో ప్రచురించి అందరికి తెలియజేసే ప్రయత్నం ఇస్కాన్ సంస్థ చేయడంఅభినందనీయమన్నారు. మనదేశ ఆధ్యాత్మిక మంత్రోచ్ఛరణలు, భగవద్గీత సారాంశాలను ఇతర ఆధ్యాత్మిక గ్రంథాల గురించి ఆధునిక పద్ధతుల్లో అందరికీ తెలియజేయడానికి ప్రయత్నించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక కార్యకలాపాలతో పాటు సామాజిక కార్యక్రమాలు చేసి ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా సామాజిక, ఆధ్యాత్మిక సేవలు అందించే సంస్థల్లో ఇస్కాన్ సంస్థ ఒకటి కావడం ప్రశంసనీయమన్నారు. సంస్థ ప్రారంభించిన అతి తక్కువ కాలంలో ప్రపంచ దేశాల్లో తమ సేవలు విస్తరించడం ఇస్కాన్ సంస్థ గొప్పతనాన్ని చాటుతుందన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఇస్కాన్ సంస్థవారు డబీల్‌పూర్ గ్రామంలోని ఇస్కాన్ ఆలయం నుంచి మేడ్చల్ పట్టణం వరకు పెద్దఎత్తున రథయాత్రను నిర్వహించారు. పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు, మేడ్చల్ మల్కాజ్‌గిరి రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ మోహన్‌రెడ్డి, దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, కొండం ఆంజనేయులు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వికారాబాద్-రాయచూర్ రైల్వే పనులకు మోక్షం కలిగింది. వెనకబడిన కొడంగల్ అభివృద్ధి పథంలో దూసుకెళ్లేలా ఈ ప్రాంతం మీదుగా రైల్వేలైన్, పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ క్రమంలో రైల్వేలైన్ సర్వే పనులకు శ్రీకారం చుట్టిన ఆ శాఖ అధికారులు వికారాబాద్ నుంచి పరిగి, కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల మీదుగా రాయచూర్ వరకు రైల్వేలైన్ పనుల్లో వేగం పెంచారు. వికారాబాద్- కృష్ణా రైల్వేలైన్ ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక కాగా, పనులు పూర్తయితే ఉపాధి అవకాశాలతో పాటు రవాణా వ్యవస్థ మెరుగు పడనుంది.

- జిల్లాలో మూడు నియోజకవర్గాలను కలుపుతూ చేపట్టనున్న రైల్వేలైన్ పనులు
- 122కిలో మీటర్లకు రూ.2,196 కోట్ల వ్యయం
- సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో నెరవేరనున్న కొడంగల్ వాసుల చిరకాల కోరిక
- రైల్వేలైన్‌తో పాటు కొడంగల్ శివారులో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు
- నిరుద్యోగ యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు



ఉపాధి ట్రాక్!

వికారాబాద్-రాయచూర్ రైల్వేలైన్ పనులు ముమ్మరం

కొడంగల్, జూలై 7: కొడంగల నియోజవర్గానికి మహర్దశ పట్టనుంది. వికారాబాద్-రాయచూర్ రైల్వే లైన్ సర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అంతేకాకుండా పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి బాటలు పడనున్నాయి. జిల్లాలోని కొడంగల్, పరిగి, మక్తల్, నారాయణపేట ప్రాంతాలకు అనుసంధానంగా రైల్వేలైన్‌ను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పనులను వేగవంతం చేస్తూ సర్వే పనులను కొనసాగిస్తున్నారు. గతంలో వికారాబాద్-కృష్ణా వరకు మంజూరైన రైల్వే లైన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో రాయచూర్ వరకు పొడిగిస్తూ సర్వే పనులకు నిధులు మంజూరు చేశారు. వికారాబాద్ నుంచి కొడంగల్ మీదుగా 122 కిలో మీటర్ల మేర రైల్వేలైన్ పనులకు రూ.2196 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. కొత్త రైల్వే ప్రాజెక్టుకు ప్రస్తుతం 122 కిలో మీటర్ల మేర గత సెప్టెంబరు నెలలోనే రైల్వే శాఖ మంత్రి జీవో జారీ చేయడంతో రూ.2196 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. దీంతో ప్రాజెక్టు పూర్తి కోసం సంబంధిత అధికారులు సర్వే పనుల్లో వేగం పెంచారు. సీఎం చొరవతో సర్వే పనులు దక్షిణ మధ్య రైల్వే జోన్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆధ్వర్యంలో వేగంగా కొనసాగుతున్నాయి. ఎంతో కాలంగా నిర్లక్ష్యానికి గురైన వికారాబాద్, రాయచూర్ రైల్వే పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ మార్గం పూర్తయితే రవాణా వ్యవస్థ మెరుగు పడటంతో పాటు కొడంగల్-నారాయణపేట ప్రాంతాల్లో సున్నపు నాపరాతి నిక్షేపాలు పుష్కలంగా ఉండటంతో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. వెనకబడిన కొడంగల్, నారాయణపేట ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి. వికారాబాద్ జిల్లా నుంచి కర్ణాటక, రాయచూర్ వరకు సర్వే పనులు కొనసాగుతున్నాయి. వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరుగనుంది. దశాబ్దాలుగా ఆగిన రైల్వే పనులు సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో మార్గం సుగమమైంది. గత ప్రభుత్వం రాష్ట్ర వాట విడుదల చేయకపోవడంతో పనులు పెండింగ్ పడ్డాయి.

హైదరాబాద్ నుంచి గోవాకు మార్గం సుగమం

వికారాబాద్-రాయచూర్ కొత్త రైల్వేలైన్‌తో హైదరాబాద్ నుంచి గోవాకు మార్గం సుగమం అవుతుందని అధికారులు అంచనావేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి తాండూర్, హుబ్లీ తదితర ప్రాంతాల నుంచి గోవాకు వెళ్లడం దూరం అవుతుంది. ప్రస్తుతం నూతన రైల్వేలైన్‌తో వికారాబాద్, కొడంగల్, రాయచూర్ మీదుగా గోవాకు వెళ్లేందుకు దూరం తగ్గుతుందని భావిస్తున్నారు. కొడంగల్ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాలను దృష్టిలోఉంచుకొని చేపడుతున్న రైల్వేలైన్‌లో మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

40 ఏళ్ల క్రితమే సర్వే పనులు

40 ఏళ్ల క్రితమే కొడంగల్ మీదుగా రైల్వే లైన్ కోసం సర్వేలు చేపట్టారు. అప్పటి రైల్వే సహాయ శాఖ మంత్రి మల్లికార్జున్ సర్వే పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 1980, 81 సంవత్సరాల్లో వికారాబాద్ నుంచి పరిగి, దోమ, సర్జాఖాన్‌పేట్, మద్దూర్, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్ మీదుగా కృష్ణా వరకు రైల్వే పనులకు సర్వే చేయించారు. అప్పటి నుంచి కొడంగల్ ప్రజల కోరిక మేరకు రెండో సారి అప్పటి ఎంపీ జితేందర్‌రెడ్డి కృషితో కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల మీదుగా రైల్వేలైన్ సర్వేను చేపట్టారు. దీంతో పాటు కొడంగల్ శివారులో సిమెంట్ పరిశ్రమలతో రైల్వే శాఖకు ఆదాయం వస్తుందనే గణాంకాలతో ఈ ప్రాంత ప్రజలు అధికారులకు, కేంద్రానికి నివేదికలు ఇచ్చారు. దీంతో కేంద్ర రైల్వేశాఖ మంత్రి ఆదేశాల మేరకు మరోసారి సర్వే పనులను చేపట్టారు. కొడంగల్ మీదుగా రైల్వేలైన్ వస్తే బాగుంటుందని నిపుణుల నివేదికతో పనులను కొనసాగిస్తున్నారు.

కొడంగల్ మీదుగా ప్రస్తుత సర్వే..

నూతనంగా చేపడుతున్న రైల్వేలైన్ సర్వే వికారాబాద్ నుంచి పరిగి, బొంరాస్‌పేట్, కొడంగల్, కోస్గి, మద్దూర్, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్, కృష్ణా మీదుగా ప్రజలకు రవాణా వ్యవస్థ మెరుగుపడనుంది, దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు రైల్వేలైన్ ఏర్పాటుతో ఎంతో దోహదపడనుంది. పరిశ్రమల ఏర్పాటుతో వివిధ రకాల సరుకుల రవాణా, రైల్వేశాఖకు ఆదాయం చేకూరుతుందని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైల్వేలైన్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించడం, సర్వే పనులు కొనసాగుతుండటంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వికారాబాద్-రాయచూర్ రైల్వేలైన్‌కు సర్వే చేస్తున్న సిబ్బంది

కొడంగల్ మీదుగా రైల్వేలైన్ చూడాలని ఉంది



నా అనుభవంలో చిరకాల కోరికగా కొడంగల్ మీదుగా రైల్వేలైన్ చూడాలనే ఆకాంక్ష. కొడంగల్ నుంచి ఎమ్మెల్యే గెలుపొందిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి సీఎం కావడం ఈ ప్రాంత ప్రజలు అదృష్టంగా భావిస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి, విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి.

- ఇందనూర్ బషీర్, కొడంగల్

విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడాలి



వెనకబడిన కొడంగల్ ప్రాంతం నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక రైల్వేలైన్‌ను పూర్తి చేయాలి. నియోజకవర్గంలో ప్రధానంగా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. రైల్వే లైన్ ఏర్పాటుతో కొడంగల్ ప్రాంత ప్రజలకు రవాణా పరంగా ఎంతో మేలు జరగనుంది.

- వేణుగోపాల్, కొడంగల్

నాణ్యతకు తిలోదకాలు!

తూతూమంత్రంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

- భూమి కుంగి బేస్మెంట్ లెవల్‌లో పగుళ్లు
- సిమెంట్‌కు బదులు డస్ట్ వాడిన కాంట్రాక్టర్
- మధ్యలోనే నిలిచిన పనులు..





నాసిరకంగా పనులు చేయడంతో బేస్మెంట్‌లో పగుళ్లు

పూర్తయ్యేదెప్పుడో?

వికారాబాద్, జూలై 7 : ఏటేటా విస్తరిస్తున్న వికారాబాద్ పట్టణంలో ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. 2021లో అప్పటి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో వికారాబాద్ పట్టణంలోని రైతు బజారు సమీపంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అయితే ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో పాటు, కాంట్రాక్టర్ చేతివాటంతో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించింది. మూడురోజులుగా కురిసిన వానలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బేస్మెంట్ కుంగిపోయింది. రైతు బజారు సమీపంలో సర్వే నెంబర్ 105లో రెండు ఎకరాల స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణం కోసం కేటాయించారు. ఇందులో కూరగాయలతో పాటు మాంసం విక్రయాలకు వేర్వేరుగా భవనాలు నిర్మించి వ్యాపారులకు, రైతులకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. అయితే నిధుల కొరతనో, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో కానీ ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

రూ. 7.20 కోట్లతో నిర్మాణం

ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కోసం ప్రభుత్వం రూ.7.20 కోట్లు కేటాయించగా ప్రభుత్వం నుంచి రూ. 4.50 కోట్లు మంజూరు కాగా, మిగిలిన రూ. 2.70 కోట్లు మునిసిపల్ జనరల్ ఫండ్ నుంచి కేటాయించాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పిల్లర్లు వేసి బేస్మెంట్ వరకు పనులు చేపట్టినా అవి నాసిరకంగానే ఉన్నాయి. బేస్మెంట్‌ను పూర్తిగా డస్ట్‌తో నిర్మించడంతో అవి కూడా పూర్తిగా పగుళ్లు పట్టి దర్శనమిస్తోంది. ఇంత తతంగం జరుగుతున్నా పాలకులు, అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.



రోడ్డుపై కూరగాయలు అమ్ముకుంటున్న రైతులు

సౌకర్యాలు లేవు



రైతు బజారులో వర్షం పడితే చెరువు కంటే ఘోరంగా ఉంటుంది. పైగా ఎలాంటి సౌకర్యాలు లేవు. కనీసం మరుగుదొడ్లలో నీళ్లు లేవు. మార్కెట్ అధికారులకు సమయానికి డబ్బులు కావాలి. కొత్తగా కట్టే భవనం ఎప్పుడు పూర్తవుతదో తెల్వదు. ఇప్పటికే కట్టిన కాడికి కూలిపోతుంది.

- అంజమ్మ, మైలార్‌దేవరపల్లి

రోడ్లపైనే విక్రయాలు

అంతే కాకుండా రైతు బజారులో సరైన సౌకర్యాలు, స్థలలేమితో ఆదివారం వస్తే చాలు రైతులు రోడ్లపైనే కూరగాయలను విక్రయిస్తున్నారు. వర్షంపడితే రైతు బజారు చెరువును తలపిస్తుండగా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రతీ వారం వ్యాపారుల వద్ద రూ.200, చెత్త సేకరణకు రూ. 50 వసూలు చేస్తూ మార్కెట్ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారే తప్పా, రైతుల గోడును పట్టించుకోవడం లేదు. తాజాగా మార్కెట్ కమిటీ ఓ ఉద్యోగి మార్కెట్‌లో రైతులు, వ్యాపారులను అసభ్యంగా దూషిస్తూ బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వ్యాపారులు, రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు రైతు బజారులో సమస్యలను పరిష్కరించాలని, త్వరగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం నాణ్యతతో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

ఇదేం క్లాస్‌రూమ్?

- తరగతి గది అస్తవ్యస్తం
- కాశీంపూర్‌తండా పాఠశాలలో దుస్థితి
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

బషీరాబాద్, జూలై 7: మండలంలోని కాశీంపూర్ తండా ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధన అస్తవ్యస్తంగా మారింది. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మరమ్మతు పనులకు తీసుకువచ్చిన సిమెంట్, ఇటుక వంటి మెటీరియల్(సామగ్రి)ని కాంట్రాక్టర్ తరగతి గదిలో పడేశారు. ఈక్రమంలో విద్యార్థులను సామగ్రి మధ్యన తరగతి గదిలో కూర్చోబెట్టి ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నాడు. గదిలో సిమెంట్ బస్తాలు, ఇటుకలను నిల్వ ఉంచడం పట్ల విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. ఈ తరగతి గదిలోని వస్తుసామగ్రిని చూసిన తండావాసులు ఇదేం తరగతి గది అంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా మండల విద్యాధికారి పాఠశాలను సందర్శించి ఇక్కడి పరిస్థితిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

తరగతిగదిలో సామగ్రి మధ్య విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు





ఆరోగ్యశ్రీ, పింఛన్లు 'దండోరా' పోరాట ఫలితమే

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ

తాండూరు రూరల్, జూలై 7: దండోరా పోరాటంతోనే ఆరోగ్యశ్రీ, వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్లు సాకారమయ్యాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాండూరు పట్టణంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాదిగ, ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 20మందితో ప్రారంభించిన మాదిగ దండోరా ఉద్యమం నేడు దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించిందన్నారు. దివ్యాంగుల పింఛన్ల పెంపునకు పోరాటం చేయడం వల్లే వారి పెన్షన్లు పెరిగాయని గుర్తు చేశారు. జూలై 7 నాటికి దండోరా ఉద్యమం 29 సంవత్సరాలు పూర్తి చేసుకుని 30వ సంవత్సరంలోకి అడుగు పెట్టబోతుందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహా మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, ఉపాధ్యక్షులు బి.కృష్ణ, కార్యదర్శి డప్పు మహేందర్, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ, కో-కన్వీనర్ అజయ్, జాని, తాండూరు మండల అధ్యక్షుడు జగదీష్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, అధికార ప్రతినిధి పరశురాం, బలరాం, రాములు, చంద్రప్ప, వెంకటేష్, కృష్ణ, డప్పు నర్సింహా, ఉమాశంకర్ పాల్గొన్నారు.


తాండూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన కేక్ కట్ చేస్తున్న నాయకులు

పంటలకు యూరియా

నవాబుపేట, జూలై 7: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆదివారం టమాట తదితర పంటలకు యూరియా, డీఏపీ రసాయనాలు చల్లుకున్నారు. పంట పొలాలు తడిగా ఉండటంతో ఎరువులు, రసాయనాలతో పంట ఏపుగా పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.


పత్తిపంటకు మసాల వేస్తున్న రైతులు

30మంది బాలలకు విముక్తి

వికారాబాద్, జూలై 7: ఆపరేషన్ ముస్కాన్-10 కార్యక్రమం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 30మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు ఎస్పీ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తప్పిపోయిన పిల్లలతో పాటుగా బాల కార్మికులుగా పని చేస్తున్న చిన్నారులు, అక్రమ రవాణాకు గురవుతున్న చిన్నారులను గుర్తించి వారిని రక్షించి పునరావాసం కల్పించడమే ఆపరేషన్ ముస్కాన్-10 ముఖ్య లక్ష్యమని తెలిపారు. జిల్లా లో ఈ కార్యక్రమం జూలై 1న ప్రారంభమై 31వరకు కొనసాగుతుందన్నారు. సబ్ డివిజన్ వారీగా లేబర్, ఉమెన్, చైల్డ్‌వెల్ఫేర్, ఎన్‌జీవోలు, పోలీస్ అధికారులతో కలిసి మూడు టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంతోషంగా చదువుకుంటూ ఆట పాటలతో సాగాల్సిన చిన్నారుల బాల్యాన్ని చిదిమేస్తున్న బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నాశనం చేయడానికి జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఒక్కరు కలిసి పని చేయాలని కోరారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనబడితే డైల్ 100కి గానీ, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712670056 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.


ఎస్పీ నారాయణరెడ్డి

సమస్య తీరేనా?

● రోడ్లపై తోపుడు బండ్లు
● స్తంభిస్తున్న ట్రాఫిక్
● పట్టించుకోని పాలకులు, అధికారులు


వికారాబాద్‌లో ట్రాఫిక్

వికారాబాద్, జూలై 7: వికారాబాద్ పట్టణంలో జనాభా రోజురోజుకు పెరుగుతుండగా అదేస్థాయిలో ట్రాఫిక్ కూడా పెరిగిపోతోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్లు పూర్తిగా రద్దీతో కన్పిస్తున్నాయి. అయితే వికారాబాద్ పట్టణంలో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి బీజేఆర్, మహాశక్తి, ఎంఆర్పీ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా పండ్ల వ్యాపారులు వ్యాపారం చేస్తున్నారు. వారే సగంరోడ్లను ఆక్రమిస్తుండడంతో వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతంలో పండ్ల వ్యాపారులకు మార్కెట్ స్థలం కేటాయించి అందులో పండ్లు అమ్ముకోవాలని ఆలోచనలు చేసినా ఆ ఆలోచనలు మాత్రం ఎవరూ ఆచరణలో పెట్టలేదు. సమస్య వచ్చినప్పుడే చర్చించుకోవడం తప్పా ఆ తర్వాత రాజకీయ నాయకుల ఒత్తిళ్ల వల్ల ఎక్కడి సమస్య అక్కడే ఉండిపోతోంది. ఓట్లకోసం రాజకీయ నాయకుడు వారిని అక్కడి వారి బండ్లను తొలగించక పోవడంతో పట్టణం నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతుంది. పోలీసు శాఖ, మునిసిపల్ శాఖ సమన్వయంతో ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న తోపుడు బండ్లను తొలగిస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయని అదే సమయంలో వ్యాపారులకు నైతంనష్టం జరుగకుండా వారికి కూడా మంచి స్థలం కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

పక్షుల ఆర్కిటెక్చర్

కొడంగల్ రూరల్, జూలై 7: అందమైన గూడు నిర్మించడంలో గిజిగాడుకు ఎవరూ సాటిరారు. మనుషులు ఇంజనీర్ ప్లానింగ్‌తో నిర్మించుకున్నట్లుగానే ఈ పిచ్చుక గూడు అమరిక, నేర్పరితనం, కళాత్మక నైపుణ్యం అబ్బురపరుస్తుంది. సన్నటి గడ్డి పరకలతో అందంగా గూళ్లను నిర్మించడం వీటి ప్రత్యేకత. గ్రామాల్లోని బావుల దగ్గర ఉన్న చెట్లకు పిచ్చుక గూళ్ల ఏర్పాటు చేసుకోవడం చూపరులను ఆకట్టుకుంటుంది. కొడంగల్ మండలంలోని నాగారం గ్రామ సమీపంలోని తమ్మచెట్టు కొమ్మలకు పిచ్చుక గూళ్ల వేలాడుతూ ఆ మార్గం మీదుగా వెళ్లే చూపరులను కనువిందు చేస్తున్నాయి. సుమారు 20 నుంచి 30గూళ్ల ఒకే చెట్టుకు ఉండటంతో ఎంతగానో ఆకర్శిస్తోంది. ఈ అరుదైన దృశ్యాన్ని ఆదివారం 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.


నాగారం శివారులో చెట్టుకు పిచ్చుక గూళ్లు



బాధిత కుటుంబానికి స్పీకర్ పరామర్శ

చేవెళ్ల, జూలై 7 : చేవెళ్లకు చెందిన సీనియర్ జర్నలిస్టు బి.వెంకటేశ్ సతీమణి సంగీత అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదివారం ఉదయం చేవెళ్ల మండల కేంద్రంలోని న్యూ జర్నలిస్టు కాలనీలో ఉన్న వెంకటేశ్ నివాసానికి చేరుకొని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బాల్‌రాజ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, రాజ్యలక్ష్మిప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే రత్నం, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి, పొల్యుషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు నాయకులు యాదయ్య, గిరిష్‌కుమార్, సలీం తదితరులతోపాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. మధ్యాహ్నం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.


మృతదేహానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు నాయకుల సన్మానం

చేవెళ్ల, జూలై 7 : ఇటీవల ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్నను చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం చేవెళ్ల పట్టణ కేంద్రం మీదుగా షాద్‌నగర్ వెళ్తున్న ఎమ్మెల్సీ మల్లన్న కొద్ది సేపు చేవెళ్లలో ఆగడంతో చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి గ్రామం మాజీ సర్పంచ్ జి. రాంచంద్రయ్యగౌడ్, ముడిమ్యాల్ పీఏసీఎస్ డైరెక్టర్ కె. నరేందర్‌యాదవ్‌లు ఆయన్ను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్సీని సన్మానిస్తున్న నాయకులు

తెలంగాణలో టీడీపీకి పునర్వైభవం

● టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదిలాల్


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యాదిలాల్, తదితరులు

ఆమనగల్లు, జూలై 7: తెలంగాణలో టీడీపీకి పునర్ వైభవం వస్తుందని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అండేకార్ యాదిలాల్, టీడీపీ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి కండె సత్యనారాయణ, పార్లమెంట్ కోశాధికారి అర్జం నర్సింహులు అన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకు తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ ప్రజల హృదయాల్లో టీడీపీ ఉంటుందని పేర్కొన్నారు. ఏపీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన అనంతరం.. తొలిసారి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు వచ్చిన సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గం నుంచి యాదిలాల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. ఆమనగల్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు, టీడీపీకి అనుకూలంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాలలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు తరలి వెళ్లారు. చంద్రబాబు నాయుడును సత్కరించి అభినందించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. యాదిలాల్, సత్యం, నర్సింహ్మలు మాట్లాడుతూ టీడీపీ సంక్షోభాలను ఎదుర్కొని ఏపీలో అధికారం చేపట్టడం కార్యకర్తల కృషి ఫలితమేనని అన్నారు. తెలంగాణలో కూడా టీడీపీకి గత వైభవం మొదలైందని, పార్టీ కోసం కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. నాయకులు ఎంగళి శ్రీధర్, కండె భాస్కర్, వజ్రలింగం, ఎన్టీ పంచాక్షరి, కోట రాములు, అనిల్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఫాతిమాపూర్ చర్చి కమిటీ

ఫాతిమాపూర్ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి

కొత్తూర్, జూలై 7: పవిత్ర ప్రార్థన మందిరంగా వెలుగొందుతున్న ఫాతిమాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని ఫాతిమాపూర్‌కు చెందిన ఫాతిమా మాత చర్చి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఫాతిమాపూర్‌లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణాలను తన నిధులతో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే సమస్యలు తన దృష్టికి తీసుకవస్తే పరిష్కారించేందుకు కృషి చేస్తానన్నారు. తనను సన్మానించిన చర్చి కమిటీ, గ్రామస్తులకు నవీన్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, మాజీ ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, కడెంపల్లి శ్రీనివాస్, కళ్లెం నర్సింహారెడ్డి, మెండె కృష్ణ, చర్చి ఫాదర్ సైమన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు అల్విన్‌రెడ్డి, చర్చి కమిటీ సభ్యులు దిలీప్‌రెడ్డి, లుర్ధూరెడ్డి, మర్రెడ్డి, సుధాకర్‌రెడ్డి, యాగరెడ్డి, బాలశౌరిరెడ్డి, సామ్‌సన్‌రెడ్డి, ఆరోగ్యరెడ్డి, కె.లుర్ధూరెడ్డి, జోసప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంతారంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

చేవెళ్ల, జూలై 7 : గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండల సీనియర్ నాయకులు కావలి వెంకటేశ్‌బాబు, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌గుప్తా అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని అంతారం గ్రామంలో ఓం సాయిరాం గ్రామ సేవా సమితి-వనస్థలిపురం ఆధ్వర్యంలో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేయడంతో పాటు మందులను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంతారం గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రజలందరు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి శిబిరాలను రానున్న రోజుల్లో మరిన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మినారాయణ, సంజీవ్, కుమార్, ఆంజనేయులు, రవికిశోర్, దయాకర్, నాగేశ్, తరుణ్‌కమార్, వైద్యసిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బుర్జుగడ్డ తండాలో వెటర్నరీ ఆస్పత్రి ప్రారంభం

- దక్షిణాదిలో అతిపెద్ద పశువుల ఆస్పత్రి
- 6వేల వరకు పశువులకు వైద్యమందించే ఏర్పాట్లు
- నా కల నేరవేరింది : ధరమ్ రాంఖా



బుర్జుగడ్డ తండాలతో వెటర్నరీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న దాతలు



శంషాబాద్ రూరల్, జూలై 7: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దషాపూర్ తండా అనుబంధ బుర్జుగడ్డ తండాలో దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద 'మా సరస్వతి' వెటర్నరీ ఆస్పత్రిని ఆదివారం దాతలు పిల్లలు రుహి, మోహర్ ప్రారంభించారు. సత్యం శివం సుందరం గోశాలల చైర్మన్ ధరమ్‌రాజ్ రాంఖా నేతృత్వంలో దాతల సహాయంతో రూ.3కోట్లతో ఈ ఆస్పత్రిని నిర్మించారు. 51,000చదరపు అడుగుల విస్తీర్ణంలో అంబులెన్స్, ఆపరేషన్ థియేటర్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, డయాగ్నొస్టిక్ వంటి సదుపాయలు కల్పించారు. ఐదుగురు వెటర్నరీ డాక్టర్లు, ఐదుగురు అసిస్టెంట్లు, ఐదుగురు పారామెడికల్ సిబ్బందితో పాటు ప్రత్యేక వైద్యులు ఇక్కడ అందుబాటులో ఉంటారు. సర్జన్లు కూడా ఉంటారని నిర్వాహకులు తెలిపారు. రోజుకు కనీసం 10పశువులకు సర్జరీలు, వంద జంతువులకు చికిత్సలందించే సామర్థ్యం ఈ ఆస్పత్రికి ఉందని డాక్టర్ నిషిత తెలిపారు. సంవత్సరానికి 3వేల శస్త్రచికిత్సలు చేయాలని, ఓపీడీ సంవత్సరానికి 36వేల జంతువులకు చికిత్స చేయాలనే లక్ష్యంతో ఇంత పెద్ద పశువుల ఆస్పత్రిని నెలకొల్పామన్నారు. ఈ ఆస్పత్రిలో సత్యం శివం, సుదరం గోశాల పశువులకే కాక చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని పశువులకు, మేకలకు, గొర్రెలకు, కుక్కలకు, ఇతర పశువులకు చికిత్సలు అందిస్తామన్నారు. నగరంలోని గగన్‌పహాడ్‌లో గల సత్యం శివం సుందరం గోశాలలో ఉన్న 3,200పశువులు, బుర్జుగడ్డ తండాలో గోశాలలో ఉన్న 2,800 పశువులకు నిత్యం చికిత్సలు అందిస్తామన్నారు. సత్యం, శివం, సుందరం గోశాల చైర్మన్ ధరమ్ రాజ్ రాంఖ మాట్లాడుతూ.. గత 30సంవత్సరాలుగా వేలాది పశువులను పోషిస్తున్నా, పశువుల ఆస్పత్రి కట్టాలనే తన కల నెరవేరిందని చెప్పారు. దీని నిర్వహణకు రోజుకు రూ.3లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు. మనుషులు జంతువులను, ప్రకృతిని ప్రేమించాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి పశువుల ఆస్పత్రి నిర్మించాలని తన కోరిక అని, అది ఇప్పుడు దాతల సహాయంతో నెరవేరిందన్నారు. ఆస్పత్రి నిర్మాణానికి విరాళరాలు అందించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

నేడు మండల ప్రజాపరిషత్తు

పాలక వర్గానికి వీడ్కోలు

- హాజరుకానున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, జూలై 7: మండల ప్రజాపరిషత్తు పాలక వర్గ వీడ్కోలు సమావేశం నేడు(సోమవారం) నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.హన్మంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ధారూరులోని శుభం ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11గంటలకు నిర్వహించే వీడ్కోలు సమావేశానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ హాజరవుతున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.



నివాళులర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

యువత అంబేద్కర్‌ను

స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్. జూలై7: నేటి యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని ఘట్‌కేసర్ కురుమ సంఘం అధ్యక్షుడు దయ్యాల గట్టయ్య అన్నారు. ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో పయనించేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, దయ్యాల రమేష్, చిందం శ్రీశైలం, దాసు, నర్సింగ్‌రావు, రాజేష్, మహేందర్, సత్యం, పరమేష్, జగదీష్, సచిన్ పాల్గొన్నారు.

ముంపుపై ముందస్తు

ప్రణాళిక ఏది?

- తీరని వరద కష్టాలు
- ఆదర్శ కాలనీ వాసులకు అవస్థలు
- స్పందించని రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు

తాండూరు, జూలై 7: వరద కష్టాలకు చెక్ పడడం లేదు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టి చర్యలకు ఉపక్రమించారు. పట్టణ శివారు నలుమూల విస్తరించిన చిలుక వాగు ప్రక్షాళనతోనే వరద కష్టాలు తీరుతాయని భావించి రెవెన్యూ, ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖలను వెంటనే రంగంలో దించారు. అవసరమైన నిధులు కేటాయించేందుకు సిద్ధమయ్యారు. లోతట్టు ప్రాంతాల ముంపును నివారించేందుకు ప్రత్యామ్నయ చర్యలు చేపట్టారు. అయినా శనివారం రాత్రి కురిసిన వర్షానికి తాండూరులోని పలు ప్రాంతాలు జలమయ్యాయి. ఇళ్లలోకి వర్షం నీరు చేరి జనం ఇబ్బందులు పడ్డారు. వానొస్తే తమకు వరద కష్టాలు తప్పడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రస్తుతం పలు కాలనీల్లో అస్తవ్యస్తమైన డ్రైనేజీ, ఓపెన్ ప్లాట్లు, నాలాపై ఉన్న కబ్జాలను తొలగిస్తే 50శాతం మేర పట్టణంలో వరద కష్టాలు తొలగుతాయని స్థానికులు అంటున్నారు.



ఆదర్శనగర్ కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు

ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలు

ఆదర్శనగర్ కాలనీ, గ్రీన్‌సిటీ, హైరాబాద్ రోడ్డు మార్గం, భవానీ నగర్ కాలనీ, ముత్యాల గల్లీ, చెంగోల్ బస్తీ, సెయింట్ మార్క్స్ హైస్కూల్ ప్రాంతం, శాంతినగర్ పార్కు ఏరియా, మార్కండేయ కాలనీ ప్రాంతాలు ప్రధానంగా ప్రతీయేడాది వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతాల్లో డ్రైనేజీలు వర్షం కురిసిన సమయంలో మురికినీరు రోడ్లపైకి వస్తోంది. డ్రైనేజీలు చిన్నవిగా ఉండడం, ఎగుడు, దిగుడు రోడ్లు ఉండడం దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యామ్నాయ చర్యలు చేపడితే కొంత మేరకు ఉపశమనం కలుగుతుందనిస్థానికులు అంటున్నారు.

నిలిచిన చిలుక వాగు కాల్వ పనులు

తాండూరులో వరద కష్టాలకు ప్రధాన కారణంగా భావిస్తున్న చిలుక వాగులో కాల్వలు తీయాలని నిర్ణయించారు. రెండు రోజుల పాటు జేసీబీ, ఇటాచీతో పనులు కొనసాగించారు. శనివారం పనులు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో పట్టాల్యాండ్, ఇళ్ల నిర్మాణం జరుగడం, కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లు ఉండడమే పనుల నిలుపుదలకు కారణంగా తెలుస్తోంది. కానీ రెవెన్యూ అధికారుల వద్ద పూర్తిస్థాయి సర్వే చేసేందుకు అవసరమైన మ్యాప్‌లు అందుబాటులో లేనట్లు సమాచారం. అడుగడుగునా అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పట్టా భూములుండడం ఇళ్ల నిర్మాణాలు పూర్తఅవ్వడంతో రెవెన్యూ అధికారులు ఇక్కడ సర్వే చేసేందుకు జంకుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం మిగిలిన ప్రాంతంలో పనులు కొనసాగుతాయా? ఇంతటితో నిలిపివేస్తారా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇక్కడ సర్వే జరగాలంటే ఐదుశాఖల అధికారులు ఉండాలి. ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, రెవెన్యూ శాఖలతో పాటు పోలీస్ శాఖ సహకారం తీసుకోవాల్సి ఉంటుంది.



శనివారం జలమయమై కట్టమైసమ్మ పక్కనున్న రోడ్డు



జలమయమై రోడ్డు

పేరుకుపోతున్న విద్యుత్ సమస్యలు

- అధికారులకు విన్నవించినా స్పందన కరువు!



పెద్దఎల్కిచర్ల గ్రామ శివారులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

చౌదరిగూడ, జూలై 7: ఆ గ్రామాల్లో చెట్టు కొమ్మ కదిలినా, చినుకు పడినా విద్యుత్ సమస్య తలెత్తడం మామూలైంది. వారంలో రెండు, మూడు రోజులకొకసారి విద్యుత్ సమస్య ఏర్పడుతోంది. అధికారులు మాత్రం స్పందించడం లేదు. కొన్నేళ్లుగా సమస్య ఉందని అధికారులకు విన్నవించినా పట్టనట్లు వ్యవహరించడం ఆ శాఖ అధికారులకు పరిపాటిగా మారింది. దాంతో మండల పరిధిలోని మూడు గ్రామాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని గాలిగూడ, పెద్ద ఎల్కిచర్ల, ధర్మతండాలో తీవ్రమైన విద్యుత్ సమస్య ఉంది. చినుకు పడినా, చెట్టు కదిలిన కరెంటు సప్లై ఆగిపోతోంది.

మూడు గ్రామాల ప్రజలకు నిద్రలేని రాత్రులు

జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని వీరన్నపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో గల పెద్దఎల్కిచర్లలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. చినుకు పడినా, చెట్టు కొమ్మ కదిలినా.. గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఇటీవల కాలంలో వారంలో రెండు సార్లు గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం పడిన సమయంలో లైన్ ట్రిప్ అవుతోందని, విద్యుత్ మీటర్లలో కరెంట్ సరఫరా అయినట్లు చూపిస్తున్నా.. ఇంట్లో బల్బు వెలగదు, ఫ్యాన్ తిరగదు. ఈ సమస్య స్థానిక విద్యుత్ అధికారుల నుంచి తాలుకా స్థాయి అధికారుల వరకు తెలిసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితి పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో కొన్ని వార్డులతో పాటు గాలిగూడ, ధర్మతండా పంచాయతీలో నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా లైన్ ట్రిప్ అవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. మండల పరిధిలోని వీరన్నపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామ పరిధిలో విద్యుత్ సమస్య తలెత్తిన సమయంలో స్థానికులతో లైన్‌మెన్.. ప్రపంచమంతా ట్రిప్ అవుతుంది.. మీకే అవుతుందా.. అంటూ గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కాగా, ఆయా గ్రామాల పరిధిలో కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు ఒక పక్కకు ఒరిగి ఉన్నాయి. మరి కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు కరెంటు తీగలకు తాకుతున్నాయి. అయినా, అధికారులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా మరికొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకకనీసం ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. దాంతో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుర్రంపల్లిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఎమ్మెల్యే హెచ్చరించినా పట్టింపేదీ

మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామ విద్యుత్ సమస్యపై ఓ సందర్భంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమస్యను పరిష్కరించాలని సూచించినా అధికారులు మాత్రం అలసత్వాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. విద్యుత్ సమస్యపై అధికారులకు విన్నివించి దాదాపు నాలుగు నెలలు గడిచినా స్పందించడం లేదు. దాంతో గ్రామస్తులు మరోమారు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

బీజేపీ మహిళా మోర్చా

జిల్లా కార్యదర్శుల నియామకం



శంషాబాద్ రూరల్/చేవెళ్ల: కుమారి,కావ్యకృష్ణగౌడ్‌లకు నియామక పత్రాలు అందజేస్తున్న నర్సింహారెడ్డి

శంషాబాద్ రూరల్, జూలై 7 : మున్సిపల్ పరిధిలోని తొండుపల్లికి చెందిన కోడూరి కుమారిని బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కుమారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నాయకుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని, మహిళా సమస్యలపై పోరాడుతానని చెప్పారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తొండుపల్లిలో మహిళ సమస్యలపై పోరాటం చేశానని గుర్తుచేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా కావ్య కృష్ణగౌడ్

చేవెళ్ల : మండల పరిధిలోని కందవాడ మాజీ ఉప సర్పంచ్ గౌండ్ల కావ్యకృష్ణగౌడ్‌కు మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. మండల పరిధిలోని దేవునిఎర్రవల్లికి చెందిన పద్మ మాణిక్యంను కార్యవర్గ సభ్యురాలుగా నియమించారు. ఈ మేరకు బొక్క నర్సింహారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు బి.రమాదేవి తదితరుల చేతులు మీదుగా నియామక ప్రతాలు అందజేశారు. పార్టీని గ్రామాల్లో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంజన్ కుమార్‌గౌడ్, చేవెళ్ల మండలాధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జి.కృష్ణగౌడ్, ఇందిరారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు

మోక్షమెప్పుడో?

- స్థలాన్ని కబ్జా చేసేందుకు రియల్టర్ల యత్నం
- ట్రాఫిక్ సమస్యలతో వాహనదారుల ఇబ్బందులు



కీసరలో దాయర రోడ్డులోని ప్రభుత్వ భూమిలో సంత

కీసర, జూలై 7: మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించి సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు నిర్మాణాన్ని చేపట్టలేదు. దీంతో కొంత మంది రియల్టర్లు కొంత స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. వారాంతపు సంత రోడ్ల పైనే నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. కీసరలో దాయర వెళ్లే ప్రధాన రహదారిపై ప్రతీ సోమవారం వారాంతపు సంత నిర్వహిస్తారు. కీసర గ్రామస్థులతో పాటు భోగారం, గోధుమకుంట, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, యాద్గార్‌పల్లి, చట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు క్రషర్ మిషన్, ఇటుక బట్టీలు, ఇతర పరిశ్రమల వద్ద పనిచేసే ఎంతో మంది వలస కార్మికులు వారాంతపు సంతకు వస్తుంటారు. కూరగాయలు, ఇతర సామగ్రిని కొనుగోలు చేస్తుంటారు. ప్రతీ సోమవారం సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 10గంటల వరకు జరిగే సంతకు వందల మంది ప్రజలు వస్తుంటారు. దీంతో దాయర రోడ్డు మొత్తం కిక్కిరిసిపోతుంది. సంతలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. రోడ్డుకు ఇరువైపులా కూరగాయాలు పోసి అమ్ముతుండటంతో, రోడ్డు మొత్తం జనసంద్రంతో నిండిపోతుంది. కీసర ప్రధానచౌరస్తా వరకు జనం తాకిడి ఉండటంతో చౌరస్తాలో పెద్ద మొత్తంలో ట్రాఫిక్‌జామ్ అవుతుంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

మార్కెట్‌యార్డు స్థలం కబ్జాకు యత్నం

మేడ్చల్ మాజీ కలెక్టర్ ఎంవీరెడ్డి సమస్యను గుర్తించి కీసరలో మార్కెట్ యార్డు నిర్మించాలని ఈద్గా వద్ద ఉన్న సర్వేనంబర్ 361లో కొంత స్థలాన్ని కేటాయించారు. నిర్మాణానికి మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, గత పాలకులు క్షేత్రస్థాయిలో స్థలపరిశీలన చేశారు. కానీ ఇంతవరకు మార్కెట్ యార్డు నిర్మించకుండా పాలకులు కాలయాపన చేశారు. దీంతో సంత సమస్య తీరకపోగా, కబ్జాదారులతో కొత్త సమస్య వచ్చి పడింది. స్థలం మాదంటూ కొంతమంది రియల్టర్లు ఇంటి నిర్మాణం చేపట్టారు. గ్రామస్థుల ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్లే మార్కెట్ యార్డు నిర్మాణానికి పునాది రాళ్లు పడలేదని, సమస్యను గుర్తించి నిర్మాణం చేపట్టి ఉంటే, ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిగి ఉండేవి కావని గ్రామస్థులు వాపోతున్నారు.

చిల్లర దొంగలకు ఆవాసంగా సంత

ఇదిలా ఉండగా, వారాంతపు సంతలో జనం కిక్కిరిసి ఉండటంతో చిల్లర దొంగలకు సంత అవాసంగా మారింది. సంతకు వచ్చే ఎంతోమంది వద్ద చిల్లర దొంగలు సెలఫోన్లు, పర్సులు చోరీ చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చెద్దామంటే పోలీసుల సెల్‌ఫోన్లే చోరీకి గురవుతుండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి.

గత ప్రభుత్వంలో పాలకులు, అధికారులు కీసర మార్కెట్ యార్డు నిర్మాణానికి చొరవ చూపలేదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వ పాలనలోనైనా కీసరలో మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టి వారాంతపు సంతకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రభుత్వ భూమి అక్రమణకు గురి కాకుండా చూడాలని సంబంధిత అధికారులను కీసర గ్రామ ప్రజలు కోరుతున్నారు.



శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి శ్రీశైలం వెళ్లే రోడ్డు

శివాలయం రోడ్డు ఇలా..

ఎవరూ పట్టించుకోకపోతే ఎలా?

కడ్తాల్, జూలై 7 : మండల పరిధిలోని మైసిగండి శివాలయానికి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా పాడై రాకపోకలకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఈ ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. కాగా, రోడ్డు సరిగ్గా లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి శివాలయం వరకు ఉన్న రోడ్డు దశాబ్దాల క్రితం అప్పటి అవసరాలకనుగుణంగా నిర్మించారు. కాగా, ఏళ్ల కాలంగా నిర్వహణ లేక బీటీ కొట్టుకుపోయి, కంకర తేలి రోడ్డు అధ్వానంగా మారింది. దాంతో తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. కిలో మీటర్ మేర ఉన్న ఈ రోడ్డును ఆధునీకరించి డబుల్ రోడ్డుగా విస్తరించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంలో ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. శివాలయం రోడ్డును ఆధునికరించడంతో పాటు మైసమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డును కూడా పూర్తిస్థాయిలో సీసీ వేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు


కొడంగల్: జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


యాలాల: ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేస్తున్న సూర్యప్రకాష్


పరిగిలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొడంగల్, జూలై 7: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాదిగ మహజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. మంద కృష్ణ మాదిగ కృషితో ఎన్నో మలుపులు తిరిగిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎన్నో సంక్షేమ పథకాలను కులాలకతీతంగా పేదలకు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్కప్ప, కార్యదర్శి ఆర్.అంజి, కొడంగల్ మండల అధ్యక్షుడు అశోక్, దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు నరేందర్, నాయకులు శ్రీగౌడ్, నాగప్ప, కృష్ణ, భీమేశ్, కృష్ణ, మహేశ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

యాలాల: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేసి, కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాలాల మండల ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఎనలేని పోరాటం చేస్తున్నారని చెప్పారు. కేంద్రంలో గత ఎంపి ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ కలిసి పని చేసిందని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ కేంద్రం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి దప్పు మహేందర్, అజయ్ ప్రసాద్, సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆశన్న, నాయకులు బుగ్గప్ప, నర్సింహులు, కృష్ణ, శ్రావణ్ పాల్గొన్నారు.

పరిగి: ఎమార్పీఎస్ 30 ఏళ్ల పోరాటంలో ఎన్నో సాధించుకున్నామని మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సుభాష్‌మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పరిగిలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఎమార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేట్ కట్ చేసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా 2002 నుంచి 2004 వరకు 28 వేల ఉద్యోగాల లబ్ధి చేకూరిందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ పోరాటం ఫలితంగా ఆరోగ్యశ్రీ, వృద్ధులకు పింఛన్‌లు సాధించుకున్న ఘనత ఎమ్మార్పీఎస్‌దే అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్, అశోక్, నితిన్, ప్రశాంత్, లాజరస్, రమేశ్, పి.రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రేయపురి కాలనీ వాసులు

కీసర, జూలై 7: తమ ప్లాట్లను గుర్తుతెలియని వ్యక్తులు కబ్జాచేయాలని చూస్తున్నారని దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కుందన్‌పల్లికి చెందిన శ్రేయపురి కాలనీ వాసులు ఆదివారం కీసరలో విలేకర్ల సమావేశంలో తమ ఆవేదన వ్యక్తం చేశారు. 2015వ సంవత్సరంలో కుందన్‌పల్లిలో సర్వేనంబర్ 137లో చేసిన వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేశామని ప్లాట్ల యజమానులు తెలిపారు. అందులో కొంతమంది ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి ఇళ్లు కట్టుకున్నారని, ఖాళీ ఉన్న స్థలాన్ని కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు తెలిపారు. ప్లాట్లను కబ్జా చేయాలని యత్నించే వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శ్రేయపురి కాలనీ వాసులు తెలియజేశారు.

ఉత్తమ వైద్యుడికి సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాండూరు, జూలై 7: తాండూర్ లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం తాండూరుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ జయప్రసాద్‌లను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు రొంపల్లి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గాజుల వీరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు


లక్ష్మయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పూడూరు, జూలై 7: మండల పరిధిలోని మంచన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంచన్‌పల్లి మాజీ ఎంపీటీసీ బి.లక్ష్మయ్యను ఆదివారం సన్మానించారు. బీసీ నాయకులు, మాజీ ఎంపీటీసీ తొండపల్లి హన్మయ్య ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చిందని, ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో మళ్లీ సేవచేసే అవకాశం వస్తే తప్పకుండా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ వార్డు సభ్యుడు యాదయ్య, నియోజకవర్గ బీసీ నాయకులు రాములు, బ్రహ్మాజీ, మంగలి అంజయ్య, అంబేద్కర్ విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మంచన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుపూజోత్సవం

కొడంగల్, జూలై 7: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో సాయంత్రం 5 గంటలకు గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి విభాగ్ పర్యావరణ ప్రముఖ్ దేవిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

దోమలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దోమ, జూలై 7: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పండ్ల తోటలకు నిబంధనల అడ్డంకి

● పెంపకానికి ముందుకు రాని రైతులు


పండ్ల తోటల పెంపకానికి గుంతల కొలతలను ఇస్తున్న ఈసీ నర్సింహారెడ్డి

బషీరాబాద్, జూలై 7: జాతీయ గ్రామీణ హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి నిబంధనలు అడ్డంకిగా మారాయి. దీంతో తోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు ముందుకు రావడంలేదు. ఫలితంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఈసారి ఉపాధిహామీ పథకం ద్వారా బషీరాబాద్ మండలంలో 40ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యం పెట్టుకుని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 19మంది రైతుల 28 ఎకరాల్లో తోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటిలో మామిడి, కొబ్బరి, నిమ్మ తోటల పెంపకానికి రైతులు ముందుకు వచ్చినట్లు వారంటున్నారు. ఉపాధిహామిలో చిన్న, సన్న కారు రైతులే తోటల పెంపకానికి అర్హులుగా పేర్కొంటున్నారు. ఈ తోటల పెంపకానికి అయిదు ఎకరాల లోపు భూమి, వ్యవసాయ బోరు రైతులు కలిగి ఉండాలి. అంతకుమించి భూమి కలిగిన వారు అనర్హులు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులు తోటల పెంపకానికి అంతగా ఇష్టపడటంలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా అయిదు ఎకరాలకు మించి భూమి ఉన్న రైతులకు తోటలు పెంచాలని ఆసక్తి ఉన్న నిబంధనలు ఒప్పుకోవడంలేదు. దీంతో తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు కొందరికి ప్రభుత్వ నిబంధనలు అడ్డు రావడంతో ఈ పథకానికి దూరం అవుతున్నారు. ఈ విషయమై బషీరాబాద్ ఉపాధిహామీ ఈసీ(ఇంజనీరింగ్ కన్సల్టెంట్) అడుగగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి లక్ష్యానికి చేరుకుంటామన్నారు. ఇప్పటికే తోటల పెంపకానికి రైతుల పొలాల్లో కొలతలనిచ్చి గుంతలు తీయిస్తున్నామని ఆయన వెల్లడించారు.

ప్రభుత్వ భూమి విక్రయానికి యత్నం


మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, ఫిలిమ్ సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్

పూడూరు, జూలై 7: ఏపార్టీలో ఉంటే ఆ పార్టీలో చేరి ఫేక్ ఎక్స్ ఆర్మీ సర్టిఫికెట్లు పెట్టి సుమారు 75ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్ముకోవాలని ప్రయత్నిస్తున్నారని, ఎన్కెపల్లి మాజీ సర్పంచ్ జూబురి రాములుపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు ఎం.మల్లేష్ పటేల్ అన్నారు. మండల పరిధిలోని మన్నెగూడలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పేద ప్రజల దగ్గర ప్రభుత్వ భూమిని రూ.8లక్షల నుంచి రూ.12లక్షల వరకు కొనుగోలు చేసుకుని భూమి ఇవ్వని వారిని దౌర్జన్యం చేసి భూమి లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఫేక్ ఆర్మీ అధికారుల సర్టిఫికెట్లు పెట్టి అట్టి భూమిని రూ.2కోట్లు ఒక ఎకరా చొప్పున హైదరాబాద్ వారికి అమ్ముతూ కోట్ల రూపాయలు దండుకుంటున్నాడని అన్నారు. ఎన్కెపల్లిలో గల 99 సర్వేనెంబర్‌లో ఉన్న భూమిని న్యాయ విచారణ చేసి జూబూరి రాములుపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ ఉన్న రిటైర్డ్ ఆర్మీ అధికారులను కూడా విచారించినా నిజానిజాలను పరిశీలించాలని అన్నారు. రియల్ ఎస్టేట్ మాఫియాకు పూడూరు తహసీల్దార్ కార్యాలయం గతంలో పనిచేసిన అధికారులకు లక్షల్లో ముడుపులు ఇచ్చి రికార్డులు మార్చారని ఆరోపించారు. ధరణి వచ్చిన తర్వాత వారి పేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కించారని, వాటిపై ఎన్‌ఓసీకి జిల్లా కలెక్టర్‌కు అప్లై చేశారని తెలిపారు. భూముల్లో ఆశ్చర్య పరిచే విషయం ఏమిటంటే 1994, 95 ఖాస్రాపాణీలో 99సర్వే నెంబర్లు 109 ఎకరాల భూమి ఉంది. 1995లో భూమిలేని నిరుపేదలకు పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారు. రెవెన్యూ రికార్డులు ప్రకారం సర్వేనెంబర్లు మిగులు భూమిలేదు. కానీ 2018 సంవత్సరంలో ఏకంగా 99సర్వే నెంబర్‌లలో 185 ఎకరాల భూమి పెరిగింది. రైతులకు ఇచ్చిన సర్టిఫికెట్లు ఉండగా, ఏకంగా 76 ఎకరాల భూమి పెరిగింది. రంగారెడ్డి జిల్లాలో ఉన్న కలెక్టర్ ఆఫీసులో కూడా ఇప్పుడున్న ఆర్మీ అధికారులకు భూమి ఇచ్చినట్లు ఎలాంటి రికార్డులు లేవు. అదేవిధంగా సైనిక్ బోర్డులో కూడా ఎలాంటి భూమి వివరాలు లేవు. కానీ కేవలం పూడూరు మండల రెవెన్యూ కార్యాలయంలో ఎన్కెపల్లి గ్రామానికి ఆర్మీ అధికారులకు భూమిని ఇచ్చారు. సుమారు భూమి విలువ రూ.150కోట్లు ఉంటుంది. రియల్ ఎస్టేట్ మాఫియా ప్రభుత్వ భూమికి దోచుకోవడానికి చూస్తుంది. స్థానిక ఎమ్మెల్యే, ఈ భూములపై సమగ్ర విచారణ చేపట్టి అర్హులైన పేదవారికి న్యాయం చేయాలని, అదేవిధంగా మోసానికి పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాము ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామన్నారు. దీనిపై కలెక్టర్‌కు, రాష్ట్ర గవర్నర్‌కు లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మండల కార్యదర్శి మల్లేష్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, నాయకులు మిట్టల్, మహేష్ పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు


ఘనపూర్‌లో నిర్మిస్తున్న శివాలయంలో మారుతి కిరణ్

కులకచర్ల, జూలై 7: మండలంలోని ఘనపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం, గోశాలలో బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్ బూనెటి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాలయం ఓ ఆధ్యాత్మిక క్షేత్రంగా మారి రాబోయే తరాలకు దిక్సూచిగా వెలుగొందాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి, గోశాలకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వెంకటయ్యగౌడ్, రాఘవేందర్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, దోమ మండల ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు నర్సింహులు, యువ నాయకులు నర్సింహులు పాల్గొన్నారు.

శిలువ గుట్టపై క్రైస్తవుల ప్రార్థనలు



మర్పల్లి, జూలై 7: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం క్రైస్తవులు పసక పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే క్రైస్తవ సోదరులు మండలంలోని వివిధ గ్రామాల క్రైస్తవులు శిలువ గుట్టకు చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు, పాస్టర్‌లు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

నవాబుపేట, జూలై 7: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు నవాబుపేట మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు కందాడ నాగిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

గాలివానకు కిందపడిన విద్యుత్ స్తంభం

- ధారూరులో తెగిపడిన విద్యుత్ వైర్లు
- తప్పిన పెను ప్రమాదం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం


ధారూరులో విరిగి కిందపడిన విద్యుత్ స్తంభం

ధారూరు, జూలై 7: ధారూరులో శనివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. కురిసిన వర్షానికి తోడు ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం, విద్యుత్ తీగలు కిందపడిపోయాయి. ఈ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. ధారూరులోని జెండా బావి సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వెనుక ఈ సంఘటన చోటుచేసుకుంది. గాలివానకు రాగి చెట్టుకు పెద్ద కొమ్మ విరిగి విద్యుత్ లైన్‌పై పడి విద్యుత్ స్తంభం, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఈ ప్రమాదంతో కూరగాయల మార్కెట్‌లోని విద్యుత్ లైన్‌కు ఉన్న విద్యుత్ తీగ కూడా తెగిపడింది. ఈ సమయంలో ఈ ప్రాంతంలో జనసంచారం లేకపోవటంతో ప్రమాదం తప్పింది. దీంతో గ్రామానికి విద్యుత్ సరఫరాను నిలిపివేసి విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా చేసినా విద్యుత్ సరఫరా నిలబడలేదు. రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా తరుచూ అంతరాయం కలిగింది. కాగా పక్కనే ఉన్న మరో వేపచెట్టు పెద్ద కొమ్మలు మరో విద్యుత్ లైన్ పైకి వచ్చాయి. ఈ లైన్‌కు ఉన్న విద్యుత్ తీగలు వేపచెట్టు కొమ్మల నడమ ఉన్నాయి. గాలివాన వచ్చినప్పుడల్లా విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలు తగిలి స్పార్కింగ్‌తో మిరుగులు వచ్చి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని స్థానికులు తెలిపారు. గాలివాన వస్తే ఈకొమ్మలు విద్యుత్ లైన్‌పై పడితే విద్యుత్ స్తంభాలు, తీగలు కిందపడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్‌పై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని వారు కోరుతున్నారు.


ధారూరులో వేప చెట్టు కొమ్మల నడమ ఉన్న విద్యుత్ తీగలు

క్రైం కార్నర్

అవుటర్ పైనుంచి లారీ బోల్తా


అవుటర్‌పై నుంచి బోల్తాపడిన లారీ

కీసర రూరల్, జూలై 7: అవుటర్ రింగ్ రోడ్డుపై నుంచి లారీ బోల్తాపడింది. ఈ ఘటన ఆదివారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ 39 యూబీ 9699 లారీ గుజరాత్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు టైల్స్ లోడ్‌తో వెళ్తోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కీసర పోలీస్‌స్టేషన్ పరిధి యాద్గార్‌పల్లి గ్రామం వద్దకు చేరుకుంది. అవుటర్ రింగ్‌రోడ్డు పైన ప్రయాణిస్తున్న లారీ అకస్మాత్తుగా సర్వీస్ రోడ్డుపై పడిపోయింది. టైల్స్‌లోడ్ బరువుగా ఉండటంతో లారీ కుప్పకూలింది. లారీ డ్రైవర్ సోహైల్, క్లీనర్ సాహిద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ప్రేమజంట

● యువకుడి తల్లిదండ్రులపై దాడి ● పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ


దాడి చేశారని ఆరోపిస్తున్న యువకుడి తల్లిదండ్రులు

తాండూరు రూరల్, జూలై 7: కొంత కాలంగా ప్రేమించుకున్న యువజంట పెద్దలు పెళ్లికి ఒప్పుకోరేమోనని ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఇరు కుటుంబీకులు ఆగ్రహంతో ఊగిపోయారు. అమ్మాయి ఆచూకీ చెప్పాలంటూ అబ్బాయి తల్లిదండ్రులపై దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలంలో ఓ గ్రామానికి చెందిన అబ్బాయి హైదరాబాద్‌లోని పెట్రోల్ పంప్‌లో పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అమ్మాయి, అబ్బాయి పనిచేసే ప్రాంతంలో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఇద్దరిది ఒకేఊరు కావడంతో స్నేహం పెరిగి ప్రేమగా మారింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే తమ కుటుంబీకులు పెళ్లికి అంగీకరించరని భయపడి గతవారం వారివారి ఇంట్లో చెప్పకుండా ఇద్దరూ ఫోన్లు స్వీచ్ఛాఫ్ చేసి వెళ్లిపోయారు. వారిద్దరూ ప్రేమపెళ్లి చేసుకున్నట్లు పుకార్లు వచ్చాయి. దీంతో గ్రామంలో అబ్బాయి, తల్లిదండ్రులను అమ్మాయి తరపు కుటుంబీకులు వేధింపులకు గురి చేస్తున్నారని బాధితులు మీడియా ముందు వాపోయారు. అమ్మాయి, అబ్బాయి ఆచూకీ తెలిపాలంటూ దాడులకు పాల్పడినట్లు ఆరోపించారు. అబ్బాయి స్నేహితులనూ వేధిస్తున్నారని తెలిపారు. దీంతో కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమపై దాడులు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు తమ బిడ్డ ఎక్కడున్నా తిరిగి రావాలంటూ అబ్బాయి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

నేడు ఆలయ భూముల కౌలుకు వేలం

దోమ, జూలై 7:మండలంలోని దొంగ ఎన్కెపల్లి గ్రామంలో గల శ్రీ సంజీవస్వామి ఆలయానికి సంబంధించిన భూములను రైతులు కౌలుకు తీసుకునేందుకు సోమవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఆలయ ఈవో సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కౌలుకు వేలంలో దక్కించుకునే వారికి కాల పరిమితి 24.07.2024 నుంచి 31.05.2026 వరకు ఉంటుందని తెలిపారు. గూడురు గ్రామంలో సర్వే నెం.66లో 14 ఎకరాలు, 135లో 10 ఎకరాల 32 గుంటలు, 173లో 20 ఎకరాల 17 గుంటలు, 174లో 38 గుంటల భూములు ఉన్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలం


పరిగిలో టీచర్ వెంకటయ్య ఇంట్లో వికసించిన బ్రహ్మ కమలాలు

పరిగి, జూలై 7: పరిగి పట్టణంలోని ఉపాధ్యాయులు కుందేటి వెంకటయ్య ఇంట్లో ఆదివారం రాత్రి బ్రహ్మకమలం వికసించింది. బ్రహ్మ కమలాలు వికసించడం చాలా అరుదు. ఏళ్ల క్రితం నాటిన బ్రహ్మకమలం మొక్కకు పుష్పాలు వికసించాయి. దీంతో వెంకటయ్య దంపతులు బ్రహ్మకమలం పుష్పాలకు పూజలు చేశారు.

ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని వినియోగించుకోవాలి

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్


శరత్‌చంద్రారెడ్డిని సన్మానిస్తున్న తోటకూర వజ్రేష్‌యాదవ్, తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 7: ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవచేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. మండలంలోని కాచవానిసింగారంలో మాజీ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ కర్రె జంగమ్మతో పాటు పాలకవర్గానికి ఆదివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవచేసే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలు పంచుకునే వారిని ఎవరు మరిచిపోరని గుర్తుచేశారు. మాజీ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ కర్రె జంగమ్మలతో పాటు మాజీ పాలకవర్గ సభ్యులకు ఆయన శాలువాలతో సత్కరించి, వారు చేసిన అభివృద్ధి పనులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గీత, మాజీ వార్డుసభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేష్, నాయకులు ముత్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు సమయానుకూలంగా బస్సులు నడపాలి


ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

తాండూరు రూరల్, జూలై 7: విద్యార్థులు, ప్రయాణికుల సమయానుకూలంగా బస్సులు నడపాలని దళిత ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తాండూరు ఆర్టీసీ బస్సు డిపో వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాండూరు బస్టాండ్‌లో కంట్రోలర్స్ నుంచి ప్రజలకు బస్సు ఉన్నదని, ఏ సమయానికి వెళుతున్నది, ఏ సమయానికి పోతున్నదని అని చెప్పడానికి బస్టాండ్‌లో కంట్రోలర్స్ ఉండాలని అన్నారు. విద్యార్థులు, ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. డిపో మేనేజర్‌కు సమస్యలు చెప్పేందుకు వెళ్లి ప్రజాసంఘాల నాయకుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే డిపో ఎదుట ఆందోళన చపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ మహేందర్, జైభీమ్ విస్తరణ కమిటీ అధ్యక్షుడు నరేష్, దళిత సేనా నాయకులు రాజ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ ప్రధానకార్యదర్శి నర్సింహులు, యాలాల మండల అధ్యక్షుడు సూర్యప్రకాష్, స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.